

# మేడమీది గది

టి. రామారావ్

"మే ఐ కమిన్ సర్"

ఏదో కథ రాసుకొంటున్న రాజారావ్ తలెత్తి చూసాడు.

గుమ్మంలో రాధ.

రాధ ఆయింటి యజమాని ఏకైక పుత్రికా రత్నం. బి ఏ. పాసైంది. ప్రస్తుతం యింట్లోనే ఖాళీగా వుంటోంది.

"యస్. డియర్‌మీన్స్"

వాయ్యారంగా నడచుకుంటూ లోపలికి వచ్చి, అజంతా శిల్పసుందరిలా నిలబడిపోయింది రాధ.

"కూర్చోండి"

కుర్చీ చూపించాడు రాజారావ్.

"థాంక్స్"

ఇంద్రధనస్సులా వొంగి కూర్చొందామె.

"గది బావుందా" అమె అడిగింది.

"ఓ. చాలా బావుంది"

ఆమె కళ్ళు వింతగా మెరిసాయి.

రాజారావ్ ఆ గదిలోనికి వచ్చి రెండు రోజులే అయింది. గది అన్నివిధాల నచ్చడం వల్లా, అద్దె కొంచెం ఎక్కువే అయినప్పటికీ వెంటనే అడ్వాన్సు యిచ్చి చేరిపోయాడు.

"మీరు కథలు రాస్తారా?"

అమె వున్నట్టుండి అడిగింది.

"ఎవరు చెప్పారు?"

"మీ ముందున్న కాగితాల దొంతరలు"

ఆమె నవ్వుతూ అంటుంటే 'చెప్దామా? వద్దా?' అనే ఆలోచనలో పడ్డాడు రాజారావ్.

"ఏదోలెండి. అప్పుడప్పుడు" నిజమే చెప్పేశాడు చివరికి.

"ఆమె మళ్ళీ అందంగా నవ్వింది. అలా నవ్వుతూన్నప్పుడు ఆమె పళ్ళు ముత్యాల్లా మెరిశాయి. వెన్నెల విరిసినట్లూ, కోటి నెమళ్ళు నాట్యం చేసినట్టూ అనిపించింది రాజారావ్‌కి.

ఈసారి ధైర్యంచేసి అమె కళ్ళల్లోకి చూశాడు.

అమె కళ్ళు రెపరెపలాడాయి.

'షాక్' తగిలినట్లు వులిక్కిపడ్డాడు.

"ఎటువంటి కథలు రాస్తారు?" అమె.

"దుఃఖాంతాలు"

"అవంటే మీకిష్టమా?"

"చెప్పలేను"

"రామారావుని విచిత్రంగా చూసింది రాధ.

కొంచెంసేపు నిశ్శబ్దం నిశ్శబ్దంగా నడిచింది వారిద్దరి మధ్య.

"సారీ..."

"తలెత్తిచూసాడు రాజారావు.

"నేను వచ్చిన పని మరచిపోయి ఏవేవో మాట్లాడుతున్నాను." అమెఅంది.

"ఫర్వాలేదు లెండి"

"అసలు నేనొచ్చింది మీదగ్గరికి ఏమైనా కథల పుస్తకాలు గాని నావెల్స్‌గాని దొరుకుతాయేమోనని"

"మీకు ఎవరి పుస్తకాలు కావాలి"

"చలం"

రాజారావ్ మాట్లాడలేదు.

"ఏం? మీకు చలం పుస్తకాలంటే మీకిష్టంలేదా?" ఆమె అడిగింది.

"అని నేను చెప్పలేదే!"

రాధ వింతగా చూసింది.

విశాలమైన కళ్ళని యింకా విశాలంచేసి మరీ చూసింది.

ఆ చూపుల్లో ఏదో మాగ్నెటిక్ పవర్ వుంది.

అమె కళ్ళలోకి అలాగేచూస్తూ వుండిపోయాడు.

"ఏమిటి అలా చూస్తున్నారు?" ఆమె అడిగింది. చిరునవ్వు పెదాలమీద చిలికిస్తూ.

"అబ్బె...బ్బె... ఏం లేదు."

రాజారావ్ కంగారు పడ్డాడు.

రాధ గల గల్లా నవ్వింది.

రాజారావ్ లేచి షెల్ఫ్‌లోవున్న చలం పుస్తకాలురెండు తీసి అమె కందిస్తూ అనుకోకుండా మళ్ళీ అమె కళ్ళలోకి చూశాడు.

"థాంక్స్. రేపు యిస్తాను"

"ఫర్వాలేదు. చదివిన తర్వాతే యివ్వండి. తొందరేమీలేదు.

"మరి నే వెళ్ళేదా?"

'వొద్దు' అని చెప్దామనుకొన్నాడు.

ఇంతలో అమె వెళ్ళిపోనే వెళ్ళిపోయింది.

ఇప్పుడు-

వొంటరిగా గదిలో రాజారావు.

ఓ నిమిషం ముందు యిదే గదిలోతనూ—రాధ.

రాజారావు మదిలో ఆలోచనలు.

ఆలోచనల్లో రాధ.

రాధ;

ఎంత చక్కటి పేరు.

పేరుకు తగ్గ అందం.

అజంతా శిల్పసుందరిలాంటి అందం ఆమెది.

అందంగా నవ్వుతోంది.



అందంగా నడుస్తోంది.
అందంగా చూస్తోంది.

ఆ చూపుల్లో ఏదో ఆకర్షణ శక్తి వుంది. కాదు కాదు ఆమె కళ్ళలోనే స్పష్టమైన చైతన్యం వుంది.

అసలు ఆమె అందానికి కారణం ఆమె కళ్ళు. విశాలమైన కళ్ళు... చేపల్లా మిల మిలా తళతళా మెరిసే కళ్ళు... అందంగా నవ్వే కళ్ళు... కొంటెగా చూసే కళ్ళు ఏవేవో మూగ బాసలు చేసే కళ్ళు... ఆ కళ్ళు... ఆమె కళ్ళు...

అందుకే ఆ కళ్ళంటె అతనికి ఇష్టం.
ఆ కళ్ళు కలిగివున్న రాధంటే యింకా యిష్టం.
అసలు —

రాజారావ్ ఆ గదిలో చేరటానికి వొచ్చిన మొదటి రోజునే ఆమెని చూశాడు... కాదు కాదు ఆమె కళ్ళని చూశాడు.

ఆమె కళ్ళు అతన్ని ఆకట్టుకున్నాయి.
అందుకే వెంటనే చేరిపోయాడు.
చేరినప్పటినుండీ ఒకటే ఆలోచన:

ఆమెతో ఎలా పరిచయం చేసుకోవాలి?
ఎలా మాటలు కలపాలి?
ఒకవేళ తను మాట్లాడించినా ఆమె పలుకుతుందా?
పలక్కపోతే ఏం చెయ్యాలి?
ఎలా చెయ్యాలి?... ఎలా? ... ఎలా?...
కాని.

అనుకోకుండా ఈ రోజు రాధే తన గదికి వచ్చింది. తనతో మాట్లాడింది. వెదకబోయిన తీగ కాలికి తగిలింది. ఇక మిగిలిందల్లా ఆమెతో ఆ పరిచయాన్ని ప్రేమగా పెంచుకోవడమే.

కాని అదిసాధ్యమా?
మళ్ళీ రాజారావ్‌లో అనుమానపు తుఫానులు.

నిజంగా ఆమెని ప్రేమించాలి. పెళ్ళి చేసుకోవాలి. అప్పుడే ప్రేమకు అర్థం పరమార్థం. అసలు అంత అందమైన అమ్మాయి ప్రేమలాభించాలంటే ఎంత అదృష్టం చేసి వుండాలి? తను అంత అదృష్టానికి అర్హుడా?
ఏమో... ఏమో .. ఆలోచనలు.

ఆ రోజు రాత్రి హాయిగా నిద్రపోలేక పోయాడు రాజారావ్.

ఆ ఇల్లు ఊరికి చాల దూరంగా వుంది
ఆ ఇంటి పైభాగంలో ఒకే ఒక గది గదికి ముందరా, ప్రక్కలా విశాలమైన ఖాళీ స్థలం

గది వెలపలి ప్రశాంతమైన ప్రకృతి అందంగా, చూడముచ్చటగా కనబడుతుంది. గదిలో కూర్చొని, గదికి పశ్చిమపు గోడ కిటికీ గుండా బైటికి చూస్తే. దూరంగా పచ్చ పచ్చటి పొలాలు... తోటలు.... ఎత్తుగా గుబురుగా పెరిగిన చెట్లు... కనిపిస్తూంటాయి.

ఉత్తరంగా వున్నది మరో పెద్దకిటికీ. అందులోంచి కనిపిస్తుంది ఊరికి దూరంగా చాలాదూరంగ వున్న విశాలమైన మైదానం. అంతులేని ఆకాశాన్ని అక్కడెక్కడో దూరపు అంచుల్లో చుంబిస్తున్నట్టు.

మైదానానికి ప్రక్కనే సమాధులు— క్రొత్తవి, పాతవి, కూలిపోయినవి, రాలిపోయినవి.

ఇదీ ముఖ్యంగా ఆ గదీ, ఆ గది పరిసర ప్రాంతాల వివరణ.

*With the best Compliments from :*

PHONES : Office : **75713**
SUPER Bazar : **75313**

# Vijaya Krishna Super Bazar : Unit of The Vijayawada Coop. Central Stores Ltd., VIJAYAWADA.

Suppliers of all Essential Commodities to Public and Weaker Sections, Government Hostels, Jails, Hospitals and Several other Quasi Government Departments.

Dealers in Medicines, Plastic-ware, Furniture Stationery, Electrical goods, Cosmotics, Textails, Provisions, Sports goods and imported and confiscated goods.

OUT RETAIL OUTLETC.

| | |
|---|---|
| Mini Super Bazars : | 3 |
| Depots : | 81 |
| Sales counters in Super Bazar : | 43 |

**K. SURYA RAO, M.A. (SW)**
M.A. (Econ) HDC.
*Managing Director*

**M.C. MAHAPATRA,**
I.A.S.,
*Chairman*

ఈ మధ్య రాజారావ్ కి రాధకీ మధ్య పరిచయం పెరిగింది.

ఒక రోజు ఆకస్మాత్తుగా రాధ అడిగింది.
"నా మీద ఒక కథ రాయరూ?" అని.
నవ్వొచ్చింది రాజారావ్ కి.
కోపంగా చూసింది రాధ.
"ఎందుకు అలా నవ్వుతారు?"
"ఔను మరి మీగురించి నేనేం రాసేది కథ"
"నన్ను చూశారుగా"
"చూస్తే?"

"ఐతే, నాలో మీకేమీ విశేషం కన్పించలేదా?"
"కనిపించింది"
"ఏమిటీ"
"మీకళ్ళు"
"నా కళ్ళు మిమ్మల్ని అంతగా ఆకర్షించాయా?"
"ఊఁ"
ఆమె నవ్వింది... అందగా... చాలా అందంగా...
ఆమె కళ్ళు నవ్వాయి... వింతగా... వినోదంగా...
రాజారావ్ ఆమెని చూశాడు.
"ఐతే ఆ కళ్ళమీదే కథరాయండి" ఆమె అంది.
మరోరోజు...
సాయంత్రం గది బయట నిలబడి పడమటి కొండల వెనక ముఖం దాచుచేసుకుంటున్న సూర్యుణ్ణి చూస్తున్నాడు రాజారావ్

పడమటి ఆకాశం ఎర్రగా... తెల్లగా... పల్లంగా... రంగురంగుల రంగులు వెదజల్లుతోంది.

మబ్బులు మత్తు మత్తుగా. వొత్తు వొత్తుగా. కదులుతున్నాయి. దట్టంగా చెట్లమీది కొమ్మమీద ఆకులమీద సూర్యుని ఆఖరి వెలుగులు పడి, మెరుస్తూనవి. అంతలోనే అదృశ్యమై పోతున్నాయి.

ఆ సమయంలో -
రాధ పైకి వచ్చింది,
మేడమెట్లెక్కి వచ్చిన అలసట ఆమెని గుసగుసగా అల్లరి పెడుతుంది.
"ఏమిటి విశేషం?" అడిగాడు రాజారావు.

"ఎందు పిల్చి,నన్నడుగుతారేం?"కొంటెగా నవ్వుతుంది రాధ.

"నేనా?"
"అవును మీరే"
"ఎవరు చెప్పారు?"




"పడమటి ఆకాశం చెప్పింది - మీరు చూస్తున్నారటగా అటు-మీ చూపు కనబడిందక్కడ. క్రింద నా గదిలోంచి." అలాఅని, చిలిపిగా నవ్విందామె
కొంటెగా నవ్వాడతడు. "భలే!"
ఇద్దరిమధ్య కొంచెంసేపు నవ్వుల అలసట.
తర్వాత రాధే అడిగింది-
"నా మీద కథ రాసారా?"
"రాసా"
"ఏదీ చూపించండి"
"గదిలో వుంది"
ఆ మాట వింటూనే గదిలోనికి పరుగెత్తి వెళ్ళి మేజా సొరుగులు లాగి. కాయితాలు వెదికి, నిరుత్సాహంగా నిట్టూరుస్తూ తిరిగొచ్చింది కాస్సేపటికి రాధ.
"ఏదీ, కనిపించలేదే!"
"రాయలేదులే"
"అబద్ధం, రాసారు"
"సరే, రాసాను"

"మరి యివ్వండి. చదువుతాను"

"యివ్వడం ఏమిటి? అదిగో ఆ పడమటి ఆకాశంమీదరాసాను. పైగదికెళ్ళిచదువుకో" అని
గలగలా నవ్వింది ఆమె
"మాటలు నేర్చారు మీరు" కొంటెగా చూస్తూ అందామె.
"కాదు...కాదు...నేర్పావు."

చీకట్లు ముసురుకొంటున్నాయి.
దూరంగా మైదానం. అక్కడక్కడా ఆకులు రాల్చిన చెట్లు మసకమసగ్గా కనబడుతున్నాయి.
గదిలో రాజారావ్.
చీకటిలో రాజారావ్,
లైటు వేశాడు.
ఏమీతోచక గదిలో పచార్లు చేస్తున్నాడు.
గదిగోడమీద కాలెండరు. కాలెండర్లో రాధాకృష్ణులబొమ్మ. రాధకళ్ళల్లో కవ్వింపు.
గదిలో నిశ్శబ్దం.
కుర్చీలో కూలబడి గట్టిగా కళ్ళు మూసుకొన్నాడు రాజారావ్

అతనికళ్ళముందు - రాధకళ్ళు
రాధకళ్ళల్లో కవ్వింపు
"రాధా! రాధా! రాధా!"
ఆమెకళ్ళు అతనిలో పరిమళపు ఊహలు లేపుతాయి.
కళ్ళు తెరుస్తాడు. కళ్ళముందు రాధలేదు.
ఏమైంది?
కుర్చీలోంచి లేచి గుమ్మంలోకి వచ్చి చూస్తాడు. రాధ వుండదు. కాని వచ్చినట్లు వినుంది. కరించలేదు.
మళ్ళీ గదిలోపల పచార్లు ప్రారంభిస్తాడు. ఆగదిని గోడమీద రాధ బొమ్మ.
భ్రమ! భ్రమ! కళ్ళుమూసుకుంటాడు.
మళ్ళీ కళ్ళు తెరుస్తాడు.
కాదు, కాదు, భ్రమకాదు. ఈ సారినిజం

గానే రాధకళ్ళు!
విశాలమైన సోగకళ్ళు!
ప్రశాంతమైన మూగకళ్ళు!
కాదు. కాదు. భ్రమకాదు.
కళ్ళునులుముకుని చూస్తాడు రాజారావ్.
మనస్సు రెపరెప మంటుంది. అవును అవి రాధకళ్ళే! సందేహంలేదు
నిదానించి దగ్గరికెళ్ళి చేతితో తడిమి చూస్తాడు.
అవి రాధ కళ్ళు.
కాదు. కాదు రాధబొమ్మకళ్ళు.
అచ్చం రాధకళ్ళలాగే వున్నాయి. జీవంతో కదులుతున్నట్టు.
గోడమీద పెయింటింగ్ బొమ్మ.
తదేకంగా చూశాడు రాజారావ్.
అతనిగుండె వేగంగా కొట్టుకుంది.

ఆ కళ్ళకింద ఏవో అక్షరాలు. ఏవో పేరు. సరిగ్గా కనిపించటంలేదు. రాసి చెరిపేసి వుంది. అయినా ఇంతకాలం తనెందుకు గమనించలేదు!
ఎవరు గీశారీ బొమ్మ!
ఎవరిదా పేరు!
బొమ్మ క్రిందిపేరుకీ— రాధకీ ఏమిటి సంబంధం?
రాజారావ్ బుర్రలో ఆలోచనలు.
పెళ్ళు... పెళ్ళు ఆలోచనలమెరుపులు.

* * *

తర్వాతి రోజు—
"రాధా"
"ఊఁ"
"ఈ గదిలో ఇంతకుముందు ఎవరుండేవారు!"
"ఒక ఆర్టిస్టు"
"పేరు"
"సుబ్బారావ్"
"ఇప్పుడెక్కడున్నాడు!"
"తెలీదు"
"ఎందుకు కాళీ చేశాడు!"
"అదో కథ"
"ఏమిటా కథ!"
"చాలా చెప్పాలి"
"........." ఆమె కళ్ళలోకి చూశాడు.
"ఇప్పుడుకాదు మరోసారి."
"పోనీ ఒక్కప్రశ్న అడుగుతాను. నిజం చెప్తావా?"
"ఎందుకొచ్చిందా అనుమానం"
"......నన్ను ప్రేమిస్తున్నావా!"
"యూ సిల్లీ."
గలగలా నవ్వు.
కాదు. కాదు. కిలకిలా నవ్వు.

* * *

"నీ పేరేకదూ రాజారావ్"
"అవును ఇంతకీ మీరు..."
"నా పేరు తర్వాత చెబుతాను. నీతోమాట్లాడాలి"
"ఓ. కె. కూర్చోండి"
"ఇక్కడకాదు"
"మరి"
"అలాదూరంగా కనిపించే ఆ మైదానంలోకి వెళదాం"
"అది శ్మశానం"
"ఏం శ్మశానమంటే భయమా!"
"లేదు"
"మరెందుకు అలా కంగారుపడి పోతావ్. అయినా మనం వెళ్ళేది శ్మశానంలోకి కాదు శ్మశానం ప్రక్కనేవున్న మైదానంలోకి"
"సరే పద"
"........."
"ఏం యిప్పుడే చెప్పమంటావా"
"వొద్దులే"
"సరే! ఇంతకీ నిన్నెందుకు పిలుచుకొచ్చానో తెల్సా!"
"తెలీదు"
"అయితే చెబుతా విను"
"........."
"నీకో కథ చెబుదామని పిలిచాను. చెప్పమంటావా!"
"కథైతే వొద్దు"
"ఏం కథకుడివై వుండీ కథ చెప్తానంటే వినవంటావేం! అయినా నేను చెప్పబోయేకథ ఏ కథకీ అనువాదంగానీ, అనుకరణగానీ కాదులే విను భయపడకు."
"భయం దేనికి!"
"అయితే విను కాని ఒక షరతు"
"ఏమిటి"
"ఈ కథ వింటున్నప్పుడుగానీ. విన్న తర్వాతగాని బాధపడ కూడదు."
"దేనికి బాధ"
"నేను చెప్పబోయే కథ నీ కథలాగే వుంటుంది."
"నా కథా! అంటే"
"అదే... నీకూ రాధకూ సంబంధించిన కథ"
"నాన్సెన్స్"
"ఎందుకంతకోపం. మీ ప్రేమాయణం నాకు తెల్సిపోయిందనా!"
"షటప్"
"చూడు రాజారావ్. నేను చెప్పబోయేకథ నీ కథలాగే వుంటుంది అన్నానే కాని నీ కథ మాత్రం కాదు. ఊరికే కోపం తెచ్చుకోక నే చెప్పేది విను"
"........."
"అనగనగా ఒక ఊరు... ఏమిటలాబిక్కముఖం వేసుకుని చూస్తావు. నేను చెప్తోంది కాశీమజిలీ కాదులే గంటల తరబడి చెప్పటానికి. కంగారు పడకు... ఒక ఊరు ఆ ఊరికి చివర్లో ఒక యిల్లు. ఆ ఇంటిచుట్టూ విశాలమైన ప్రహరీ. ప్రహరీ లోపల వివిధ రకాల పూలమొక్కలూ క్రోటన్స్. ఆ ఇంటి పై భాగంలో ఒకగది. ఆ గదిలో ఒకఅద్దె యి, అతడో ఆర్టిస్టు. వయస్సు సుమారు



యికపై అయిదుగోపు అమ్మాయిల్ని కలల్లో కవ్వించే అందం అతడిది. బొమ్మలు చాలా బాగా గీస్తాడు. కథలు రాయడు గానీ ఎప్పుడూ ఊహాలోకాల్లో విహరిస్తూ వుంటాడు. ఏదయినా సుందర దృశ్యాన్ని చూచినా, సుందర స్వప్నాన్ని కన్నా ఆ వెంటనే అందమైన రంగుల్లో అందమైన చిత్రాన్ని గీసేవాడు...ఇదీ ఆ మేడమీది అబ్బాయిగురించి...

"ఇకపోతే మేడ క్రింది అమ్మాయి గురించి కూడా రెండు మాటలు చదువుకున్నది. అందమైనది. ఒకరోజు ఆర్టిస్టు ఆమెని చూడటం జరిగింది. పోతపోసినట్టున్న ఆమె అవయవ స్వరూపం అతన్ని ముగ్ధుణ్ణి చేసింది. అన్నిటికంటె ఆమె కళ్ళు విశాలమైన కళ్ళు పోగకళ్ళు... అతన్ని ఆకర్షించాయి. అతని హృదయంలో ఆమెరూపు తైలవర్ణ చిత్రంగా గీసుకున్నాడు. ఆ మరుసటిరోజే ఆమెచిత్రాన్ని వివిధ రంగులతో అందంగా గీశాడు. ఆ చిత్రాన్ని అకస్మాత్తుగా ఆమె చూచింది. అతనిలోవున్న కళాహృదయానికి పొంగిపోయింది. అతని అందానికి ముగ్ధురాలైంది, అతనికి చేరువయ్యింది.

"అలా పరిచయమైంది. వారిద్దరికీ, అతరువాత ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆమెను చూడనిదే అతడుండేవాడు కాదు. కళ్ళు మూసినా కళ్ళు తెరచినా ఆమె విశాలమైన కళ్ళు కనబడేవి. గిలిగింతలు పెట్టేవి. కవ్వించేవి... నవ్వించేవి... ఏదోబాసలు చేసేవి. ఏవేవో చిలిపిఊసులు చెప్పేవి... అంతే! అతనికి రాత్రింబవళ్ళు ఆమె తలంపే. రాత్రులు నిద్ర పట్టేదికాదు. ఆమెదగ్గరవున్నరాత్రి శివరాత్రి... లేనిరాత్రి శివరాత్రే.

"మరి కొన్నాళ్ళకి తెలుసున్నాడు ఆమె లేనిదే జీవించలేనని... అందువల్ల ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆమెను జీవిత భాగస్వామిగా స్వీకరించాలనుకొన్నాడు. ఒకరోజు ఆ విషయం ఆమెతో చెప్పాడు. అందుకామె విచిత్రంగాచూసింది. వింతగా నవ్వింది.

"నన్ను ప్రేమిస్తున్నావా?" అందామె.

"ఔను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను" అన్నాడతను.

"నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను." సరేనా

"మరి మనం పెళ్ళిచేసుకొంటే"

ఈ సారి ఆమె గల గలా నవ్వింది. నవ్వి ఇలా అంది.




"పూర్ డియర్! నువ్వు చాల అమాయకుడివి. అందుకే నువ్వంటే నాకు చాలయిష్టం. కాని ఒక విషయం ప్రేమకూ పెళ్ళికీ అసలు సంబంధం లేదని నా ఉద్దేశం. ప్రేమించుకున్నవాళ్ళు పెళ్ళి చేసుకోవాలనీ, పెళ్ళిచేసుకున్నవాళ్ళు ప్రేమించుకోవాలనీ ఎక్కడా రూలులేదు. మనం ప్రేమించుకున్నాం పెళ్ళి చేసుకోవద్దు. మనం ఇలాగే ప్రేమపక్షుల్లా హాయిగా కాలాన్ని గడుపుదాం... అయినా పెళ్ళిచేసుకుని ఏం సుఖపడతాం చెప్పు. పిల్లలతో, సంసారభారంతో, అప్పులతో, అవస్థలతో, చాలీ చాలని జీతాలతో జీవితాన్నిభారంగా, మరింత శోకంగా గడపటం నాకిష్టంలేదు అందుకే పెళ్ళంటే.నాకు పరమ అసహ్యం. మనం పుట్టింటి సుఖం అనుభవించటానికి అంతేకాని కోరి కష్టాలు తెచ్చుకోవడానిక్కాదుగా అందుకే మనం ఇలాగే వుండిపోదాం" అందామె.

"ఆ మాటలకు అతడు పిచ్చివాడైపోయాడు. అతని ఆశలన్నీ కూలి పోయాయి. కట్టుకొన్న మేడలన్నీ గాలిలో తేలిపోయాయి. తాను కలలు గన్న సుందర సుకుమార స్వప్నాలన్నీ రాలిపోయాయి. భవిష్యత్ మార్గం అగమ్యగోచరంగా కనిపించింది. ఇప్పుడు చెప్పు రాజారావ్. అటువంటి 'షాక్' తగిలిన మనిషి ఏం చేస్తాడు?"

"ప్రేమించిన వ్యక్తిచేత తిరస్కరించబడిన తర్వాత ఇంకఅతడు బ్రతకటం అనవసరం."

"భేష్! బాగా చెప్పావ్ మరి అటువంటి ఆడదాని మీద నీ అభిప్రాయం!"

"ఆమె ఆడది కాదు రాక్షసి."

"భేష్. మరి అటువంటి ఆడదాన్ని ప్రేమించే వాడినేమనాలి "

"పిచ్చోడనాలి."

"అయితేనువ్వు పిచ్చోడివా!"

"ఏమిటి నువ్వంటున్నది!"

"ఇంకా అర్థంకాలేదా నీకు రాజారావ్"

"లేదు"

"నేను చెప్పిన కథలోనిహీరోయిన్ నువ్వు ప్రేమించే రాధ"

"వ్వాట్"

"ఔను రాధే"

"అబద్ధం. రాధ అలాంటిది కాదు. ఆమె ఎన్నటికీ అలా చెయ్యదు. రాధ చాల మంచిది

"అని నువ్వు భ్రమపడుతున్నావు"

"నో...నో"

"చూడు రాజారావు. నిన్ను చూస్తే నాకు జాలేస్తుంది. రాధను ప్రేమిస్తున్నావు నాకు తెలుసు. కాని ఒక్క విషయం తాత్కాలికంగా కోర్కెలు తీర్చుకోవడానికైతే ప్రేమించు. ప్రేమిస్తున్నట్టు నటించు. నా కభ్యంతరం లేదు. కాని పెళ్ళి చేసుకోవాలని ఆశ పెట్టుకుంటేమాత్రం అది నిరాశే అవుతుంది.

"........."

"అఁ ఇంతకీ నువ్వు రాధను పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నావు కదూ"

"నీ కెలా తెలుసు?"

"నాకప్పీ తెల్పని ముందే చెప్పాను. ఆల్ రైట్ ఇంతకీ రాధని అడిగావా పెళ్ళిచేసుకొంటావని"

"అడగలేదు"

"ఒకవేళ అడిగితే— ఆమె నిరాకరించితే తట్టుకొనే స్థైర్యం వుందా"

"లేదు"

"అయితే రాధను మర్చిపో గదిఖాళీచేసి పారిపో"

"ఇంతకీ నువ్వు!..."

"నేనెవర్నో చెప్పమంటావా?"

"చెప్పు"

"చెబితే భయపడవు కదూ"

"లేదు చెప్పు"

"నేనే ఆ ఆర్టిస్టుని"

"నువ్వా!... నువ్వు. నువ్వు... బ్రతికే వున్నావా?"

"లేదు నేను చచ్చిపోయి చాలా రోజులయింది."

"మరి ఇప్పుడు నాతో మాట్లాడుతున్నావు"

"పిచ్చోడా. నేను భౌతికంగా చచ్చిపోయాను కానీ నా ఆత్మ ఆ గదిలో, ఆగది పరిసరాల్లో ముఖ్యంగా రాధచుట్టూ, రాధను ప్రేమించే వారిచుట్టూ తిరుగుతూంటూంది"

" ... ... ... "

"నేను రాధను ప్రేమించాను. ఎంతగా ప్రేమించానో చెప్పలేను. అదీగాక నాలాగ రాధను మరోవరు ప్రేమించకూడదు. నా లాగ ప్రేమించి మోసపోకూడదు. అది నా ఉద్దేశం"

"నమ్మమంటావా"

"పిచ్చోడా. నువ్వు నమ్మినా నమ్మకపోయినా నిన్ను రాధనుండి రక్షించడం నా విధి. ఆ గదిలోచూడు. గది గోడమీద రెండు కళ్ళుగీచాను. అవి రాధ కళ్ళు. ఆకళ్ళక్రింద పేరు చూడు. అది నాది"

"అంటే ... నువ్వు ... సుబ్బారావ్"

"ఔను. నేనే సుబ్బారావ్ ని. చూడు రాజారావ్ ... ప్రేమించడం, మనస్విచ్చడం ఒక కళ. ఎవరిని ప్రేమించాలో, ఎవరికి మనస్విచ్చాలో తెల్సుకొని భవిష్యత్తులోకి అడుగెయ్యడం చాల అవసరం"

" ... ... ... "

"మరి నేను వస్తా."

ఆ మనిషి అదృశ్యమయ్యాడు.

ఉలిక్కిపడి లేచాడు రాజారావ్.

సుబ్బారావ్ కనిపించలేదు.

కళ్ళు బాగా నులుముకొని చూచాడు.

అది మైదానం కాదు ... తన గది.

తనగదిలో తను ... చీకటిలో తను.

చీకటిలో తలుపులవైపు చూచాడు, తన తలుపులు మూసేఉన్నాయి.

లైటువేశాడు ... లైటు వెలుతుర్లో ... గదిగోడమీదికి దృష్టి నిలిపాడు

లైటు వెలుతుర్లో ... గది గోడమీద ... రెండు కళ్ళు ...

ఆ కళ్ళక్రింద ఎవరిదో పేరు...పరీక్షగా చూశాడు.

ఆశ్చర్యం!

రాజారావ్ గుండె దడదడ కొట్టుకొంది.

ఒళ్ళు గగుర్పొడిచింది.

మళ్ళీ తదేకంగా చూశాడు. అవేకళ్ళు... అవే కళ్ళు...

ఆకళ్ళు ఏవో మూగబాసలు చేస్తున్నట్లున్నాయి.

నవ్వుతున్నట్లున్నాయి...ఏవేవో చేస్తున్నట్లున్నాయి.

అతనే!

గట్టిగా కళ్ళు మూసుకున్నాడు ...

గోడమీద కళ్ళు.

కళ్ళక్రింద పేరు...సుబ్బారావ్!!

* * *

ప్రొద్దునే 'చరం' పుస్తకాలు ఇవ్వడానికి మేడమీదికి వచ్చింది రాధ.

ఆశ్చర్యం!!

గది ఖాళీగా వుంది.

రాజారావ్ లేడు ... బోసిగా కన్పించింది గది.

కాని —

గదిమధ్య రెపరెపలాడుతూ ఓ కాయితం దాన్ని అందుకొంది రాధ.

అందులో —

"రాధా,

ఈ మేడమీది గదిలో గోడమీది నీకళ్ళు నాకో కథను చెప్పాయి. కాదు ... కాదు ... సుబ్బారావ్ వ్యధను చెప్పాయి.

తనలా మరొకరు మోసపోకుండా రక్షిస్తున్న సుబ్బారావ్ కు ఎంతో ఋణపడి వున్నాను. సెలవ్!!

— రాజారావ్"

శిలాప్రతిమలా గోడవైపు తిరిగింది రాధ

గోడమీద కళ్ళు ... తన కళ్ళు ... అవే కళ్ళు...

ఆ కళ్ళే ఈరోజు తనని చూచి నవ్వుతున్నాయి.


*With the best Compliments from :* Tel. Off : 25

**Sri Venkateswara Rice, Groundnut and Oil Mill**

*Proprietors :* **POTNURU CHANDRABHASHANAM**

Narasannapeta

Srikakulam Dist.